# వసుధైవ కుటుంబకమ్



**బొమ్మలండీ,** బొమ్మలూ, పిల్లలకు ఆనంద మిచ్చే ఆట బొమ్మలండీ, బొమ్మలూ" అని తీయని మత్తెక్కించే మధుర స్వరంతో పాడుతూ, వీధులవెంట అతను తిరుగుతూ ఉంటే, వినే వాళ్లంతా మైమరిచిపోతారు. ప్రతి ఇంట్లోను కలకలం బయలుదేరుతుంది. చంటిపాపలను చంక నిడుకొని తల్లులు బయటికి తొంగిచూస్తారు. ఆ పరిసర ప్రాంతాలలో—తోటలలోను, వీధుల్లోను ఆడుకొంటూ కేరింతాలుకొట్టే పిల్లల గుంపు అతనిని పరివేష్టిస్తుంది.

ఒకరోజు ఇలాగే పిల్లలంతా అతనిచుట్టూ చేరారు. అతను బొమ్మల బుట్ట దింపి, మూత తెరిచి వాళ్లకు చూపిస్తున్నాడు. బొమ్మలు చూసిన పిల్లలు ముగ్ధులైపోయారు. ఇంటికి వెళ్లి డబ్బులు తెచ్చుకుని రకరకాల ప్రశ్నలు వేయ మొదలెట్టారు. "దీని కలిదెంత?" "ఉ! ఇది ఎంతకిస్తావు?" వారి మాటలు అతన్ని అత్యంతానంద విహ్వలుణ్ణి చేసేశాయి. వారి చిన్నారి చేతుల్లోంచి డబ్బులు తీసుకొని కావలసిన బొమ్మ లిచ్చిపంపేశాడు. వాటిని తీసుకొని ఆనందంగా గంతులువేస్తూ వెళ్లే పిల్లలను చూసి లోలోపలే పొంగిపోయాడు, చంద్రుణ్ణి చూసిన సముద్రంలాగా. మళ్లీ అక్కడనుంచి "బొమ్మలండీ, ఆట బొమ్మలూ, పిల్లలకు ఆనందమిచ్చే బొమ్మలండీ, బొమ్మలూ' అంటూ అతను వెళ్లిపోతూ ఉంటే, అతని గానతరంగం సాగర తరంగంవలె చుట్టుపక్కల ప్రసరించి ప్రతిధ్వనించింది.

ఒకసారి రావ్ బహదూర్ రాజశేఖర్‌గారి పిల్లలు రవి, శ్యాముకూడ బొమ్మలు కొనుక్కుని ఇంటికి తెచ్చుకున్నారు. రవి తన బొమ్మను చూచుకుని "నా గుర్రం ఎంతబాగుందో" అని పొంగిపోతున్నాడు. శ్యాముకూడా "నా ఏనుగు ఎంత అందంగా ఉందోచూడు" అంటూ మహానంద భరితుడై ఇల్లంతా గంతులేయ నారంభించాడు.

రోహిణి మాతృహృదయం వారి ఆటలు చూస్తూ ఆనందాబ్ధిని ఓలలాడిపోయింది. పిల్లలను పిలిచి బొమ్మలు ఎంతక్కొన్నారని అడిగింది. "రెండు అణాలకే బొమ్మలిచ్చి పోయేలవమ్మా అబ్బి" అని ఏకకంఠంతో జవాబిచ్చారు వాళ్లు.

'అబ్బ! ఇంత చవకగా ఎలా ఇచ్చేడు! అసలు ఎలా ఇవ్వగలడు? ఏమో? అది అతనికే తెలియాలి. ఇవ్వడం ఇచ్చేడు!' అని తనలో తానే తలపోసింది రోహిణి. ఆమెకిది ఒక సాధారణమైన విషయం కావడంచేత అట్టే పట్టించుకోకుండా తన పనిలో నిమగ్నురాలైంది. మళ్లీ ఈ విషయమై ఆలోచించవలసిన అవసరం ఏముందామెకు?

## 2

ఆరునెలల తరువాత. ఆ పట్టణంలోకి ఒక మురళి వ్యాపారి వచ్చాడన్న వార్త నాలుగైదు రోజులలో పాకిపోయింది. "మురళీ వాద్యంలో

అతడు సాటిలేని మేటి. అతడు పిల్లనగ్రోవిని వాయిస్తూ ఉంటే సాక్షాత్తూ శ్రీకృష్ణుడే అవతరించాడా అనిపిస్తుంది."

"అంతా బాగుంది కాని రెండే రెండు అణాలకు అమ్మడం వలన పాపం అతనికేంలాభం ఉంటుంది? మజూరీ అయినా కిట్టి ఉండదు బహుశా" అని ప్రజలు చెప్పుకోసాగారు.

"ఎలాఉంటాడా మురళి వ్యాపారి? నేనతన్ని చూడనేలేదు." ఒకరి ప్రశ్న.

"ముప్పై, ముప్పై రెండు సంవత్సరాల కంటెఉండదు వయస్సు. ఎర్రగా, సన్నగా, బక్క పల్చగాఉంటాడు. గులాబిరంగు పాగా ధరిస్తాడు." మరి ఒకరి వర్ణనాత్మకమైన జవాబు.

"వెనక ఆటబొమ్మలమ్మినవాడేమిటి చెప్మా!" ఒకరి సందేహం.

"ఏమిటి అతను పూర్వం ఆట బొమ్మలు కూడా అమ్మేవాడా?" అని ఒక ఉత్కంఠ.

"ఆఁ! అతను కూడా సరిగ్గా ఇలాగే ఉండే వాడు. అయితే, ఇతనే అతనై ఉంటాడు. గొప్ప ప్రవీణుడు సుమా!" అనే నిశ్చితాభిప్రాయం.

ఈ ప్రకారం మురళి వ్యాపారి తన పరోక్షంలో కూడా ప్రశంసాపాత్రుడైనాడు. ప్రతివీధిలోనూ అతని ముగ్ధ మోహన స్వరం ఆబాల గోపాలాన్ని మరింత ముగ్ధులను చేసేస్తున్నది నాగస్వరం సర్పిణినివలె

రోహిణికి కూడా అతని స్వరం వినగానే బొమ్మల బేహారి జ్ఞప్తికి వచ్చాడు. 'బొమ్మల వ్యాపారి కూడా ఇదే విధంగా పాడుతూ అమ్మే వాడు' అని తనలో తానే తలపోసింది. వెంటనే లేచి భర్తవద్దకు వెళ్లి—

"మురళీలను పిలవండీ, మన రవి, శ్యాములకు కొంటాను. మళ్లీ ఇటు వస్తాడు, రాక పోతాడు, పిల్లలుకూడ ఆడుకుందుకు పార్కుకు పోయారు" అంది.

పత్రిక చదువుతున్న రాజశేఖరంగారు లేచి ఆలాగే పత్రికను పట్టుకునే ద్వారంవద్దకువచ్చి "ఓయ్! మురళీఎలా ఇస్తున్నావు?"అని అడిగారు.

ఇంతట్లోకే ఉరకలు, పరుగులుతీస్తూ పిల్లల గుంపు అతనివైపు బయల్దేరింది. ఒకరి నొకరు తోసుకుంటూ, జారిపోయిన లాగు పైకైనా తీసుకోకుండా, జారిపోయినజోడు ప్రసక్తే లేకుండా "మాకూ కావాలి మురళీ" అంటే "మేమూ తీసుకుంతాంమురళీ", "మేము కొనుక్కుంతాం" అంటూ ఒక్కుమ్మడిగా తన్ను చుట్టుముట్టిన పాపలను చూసి ఆనంద భరితుడైపోయాడా వ్యాపారి.

"అందరికీ ఇస్తా బాబూ. కాస్త ఆగండి. కాస్సేపుండండి. ఒక్కొక్కరినే తీసుకోసిండి. నే నెక్కడికీ పోను మీరు తీసుకునేదాకా. తొందర పడకండి. అయిపోతాయని భయపడకండి. ఒకటి రెండు కాదు, బోలెడు మురళీ లున్నాయి, ఇప్పుడు నా దగ్గర. ఏం?...ఆఁ! బాబు తమరే

**ఆనందంకోసమే అహర్నిశమూ అలమటిస్తాడు మానవుడు. అది అందని మ్రాని పండు, పలువురికి ఆనందం కరమైన మనిషిలో మాత్సర్యం పెరగడం సంభవం. ఇతరుల ఆనందం—బాహికము, క్షణికమే అయినా—సహించరానిది అవుతుంది. తనకులేని దానిని వేరొకరు అనుభవించరాదు. ఈ స్థితి అధిగమించగలిగితే అంతా ఆనందమే.**

మిటి అడిగేరూ? ఎంతకిచ్చేవనా? చెప్పడమైతే మూడు అణాలు. కాని, ఇచ్చేది రెండు అణాలకే బాబు. అదైనా తమకి కనుక."

రాజశేఖర్‌బాబు ఆంతర్యంగామూ, బాహ్యంగామూ కూడ నవ్వుకున్నారు. 'ఎంతమోసం! అందరికీ ఇదే ధరకి ఇస్తూ నాకేదో ప్రత్యేకత చూపిస్తున్నట్లు నటిస్తున్నాడు!' అనుకున్నాడు. పైకి "మీ వ్యాపారస్తులకు అబద్ధాలాడటం అలవాటైపోతుంది. అందరికీ ఇదే ఖరీదుకు ఇచ్చి ఉంటావు. నాకు మాత్రమే తగ్గిస్తున్నట్లు మాట్లాడుతున్నావు" అన్నారు.

మురళీవాలా ఒకసారి నిశ్చేష్టుడైనాడు. తేరుకుని, "తమకేం తెలుస్తుందిబాబూ, వీటికి పెట్టుబడి ఎంత అయ్యిందో! అమ్ముకునేవాడు నష్టానికి వస్తువునిచ్చినాసరే, వ్యాపారస్థులు మోసకారులు, హమ్మ దోచుకుంటున్నారని తలవడం, అనడం కొనేవారికి పరిపాటై పోయింది బాబయ్యా! తమరు నమ్మరుసామీ. నిజానికి దీని కిట్టుబడే మూడు అణాలండీ. ఇంకెక్కడైనా నాకంటేచవకగా యిస్తే నేను ఊరికే యీ బుట్టెడు మురళీలు వదిలేస్తానండి బాబయ్యా!" అన్నాడు.

"సరే, సరే. నాకు పనుంది. వేగం రెండు మురళీలు తీసిఇయ్యి."

రెండు మురళీలు తీసుకుని రావుబహదూర్ గారు పైసాలిచ్చేసి లోపలికి వెళ్లిపోయారు. మురళీవాలామాత్రం పిల్లలకు వారు కోరిన మురళీ లిస్తూ కూర్చున్నాడు.

"ఇది చాలా మంచి మురళి. నువ్వూ ఇదే తీసుకోబాబూ. ఆ నాయనా నీకూ అలాంటిదే ఇస్తా. ఇదిగో తీసుకో. మరి డబ్బులో?—లేవూ? అయితే నేనిక్కడే ఉంటాను. అమ్మనడిగి పైసాలు తెచ్చుకో.... నువ్వు డబ్బులు పట్టుకొచ్చావా? ఇంద యిది తీసుకో... నీకు డబ్బులు ఇవ్వలేదు అమ్మ? అయితే నువ్వు అడగవలసినట్లు అమ్మని అడిగి ఉండవు. చీరకొంగు పట్టుకొని, కాళ్లను పెనవేసుకుని అమ్మని పైసాలడుగుతారునాయనా. ఆ. మళ్లీపో. ఈ సారి తప్పక ఇస్తుంది. పావలా కాసా? అయితే ఏం? ఈ మూడు అణాలు తిరిగి తీసుకో. లెక్క సరిపోయిందా?.... డబ్బులు తెచ్చుకున్నావా? నే నెంత మంచి ఉపాయం చెప్పానో చూశావా? ఇంద తీసుకో మురళి. అందరూ తీసుకున్నారా? ఇంకెవ్వరికీ అక్కర్లేదా?

## టి. వి. సుబ్బలక్ష్మి

ఏం, నీకు డబ్బులు లేవూ? అమ్మదగ్గర లేవా? సరే, నువ్వది తీసుకుపో. నేనూ పోతాను."

## 3

నేడు రోహిణి తన ఇంట్లో కూర్చుని మురళీవాలా మాటలన్నీ వింటూంది. పిల్లలతో ఇంత వాత్సల్యపూరితంగా మాట్లాడే వ్యాపారిని ఇంతకు ముందెప్పుడూ చూడలేదనుకుంది. బేరంకూడా ఎంత చవగ్గా ఉంది! పెద్దమనిషిలా కనిపిస్తున్నాడు. రోజూ అతనిలా ఇంటింటా వీధివీధి తిరుగుతున్నాడంటే అది అతని గ్రహపాటే అనాలి. పొట్టకోసం ఎన్నైనా అవస్థలు పడాలి కదా! అని ఏమేమో తలపోస్తున్నది.

ఇంతలో మురళీవాలా హీనస్వరం "మురళీలండీ మురళీలు. ముచ్చటైన మురళీలు" పక్కవీధులోంచి వినబడింది. రోహిణి దానితో బాహ్యప్రపంచంలోకి వచ్చింది. చాలాకాలంవరకు అతని కమ్మని కంఠం, పిల్లల ఎడ అతని స్నేహార్ద్ర ప్రవర్తన ఆమె స్మృతిపథంలోంచి తప్పుకోనే లేదు. రోజులు, పక్షాలూ, మాసాలూ కూడ గడిచిపోయాయి. మురళీవాలా రాలేదు. కాల గర్భంలో అతని స్మృతి లీనమైపోయింది.

## 4

ఎనిమిది మాసాల అనంతరం. అది చలికాలం. రోహిణి స్నానంచేసి ఆజానులంబి కేశపాశాన్ని డాబామీద నించుని ఆరబెట్టుకొంటున్నది. అదే సమయానికి క్రింద వీధులో—"పిల్లలసంతోష పెట్టే మిఠాయివాలా" అనే తీయని కంఠం వినిపించింది. ఆ గొంతు సుపరిచితమే కావడంవల్ల రోహిణి గబగబ డాబా దిగివచ్చింది. అప్పుడామె భర్త ఇంటివద్ద లేడు. ఒకముసలి ఆయామాత్రం ఉంది. ఆమెతో మిఠాయివాలాను పిలవమని చెప్పింది. ఆమె అట్లే చేసింది.

మిఠాయివాలా వచ్చి "ఎంతో కొత్తరకం మిఠాయమ్మా. నోట్లో వేసుకుంటే కరిగిపోతుంది. కడుపులో కెళ్లిందంటే తిన్నదంతా అరిగిపోతుంది. దగ్గు, గురకలాంటి జబ్బులకు కూడా దివ్యౌషధమండీ అమ్మగారూ" అన్నాడు.

"ఎలా ఇస్తున్నావు?" అని అడిగింది ఆయా.

"అమ్మా, నేను బేరాలు చెప్పను. ఒకటేబేరం. ఒక రూపాయికి పదహారు చొప్పున ఇస్తున్నాను తల్లీ!"

"అంత ప్రియమా! పాతిక చేసుకో."

"లేదమ్మా. ఇదిమాత్రం ఎలా యిస్తున్నానంటే... ఇది యిప్పుడు మీకేం? ఇదంతా మీతో ఎందుకుతల్లీ? ఇంతకంటె ఎక్కువఅయితే

# వసుధైవ కుటుంబకమ్

కిట్టదమ్మా.''

రోహిణి ముసలి ఆయా దగ్గరే కూర్చుని ఉంది. మెల్లగా ఆమెతో ''అయినా చవగ్గానే ఇస్తున్నాడు. ఓ రెండు రూపాయలివి తీసుకో. ఇదిగో డబ్బు'' అంది.

ఆమె ''పోనీ పాతికకాకపోతే ముప్పై చేసుకోనీయమ్మ. బొత్తిగా ముసల్దాన్నై పోయాను. బేరమాడ్డంకూడా బాగారాదు నాకు'' అంటూ ఉంటే ఆమె బోసినోటినుంచి చిరునవ్వు చిందులాడింది.

రోహిణి ''నీ వింతకుముందెప్పుడైనా ఈ ఊరు వ్యాపారానికి వచ్చావా? లేక ఇదే మొదటిసారా?'' అంది.

''మొదటిమాటు కాదుతల్లీ, ఇంతకుముందు చాలాసార్లు వచ్చి ఉన్నానమ్మా.''

''మొదటిసారికూడా మిఠాయిఅమ్ముతూ వచ్చావా? ఇంకేమైనా తెచ్చావా?''

ఇట్టి ప్రశ్నలకు మిఠాయివాలా హర్షసంశయ విస్మయాది భావాలకు లోనయ్యాడు. ''ఓసారి ఆటబొమ్మలు, మరోక పర్యాయం మురళీలు తెచ్చానమ్మా'' అని జవాబిచ్చాడు.

రోహిణి అనుమానం తీరిపోయింది. ఇంకా చాలా ప్రశ్నలు వేయాలనుకుంది. వెంటనే ''ఈ వ్యాపారాల్లో నీకేమాత్రం లాభం వచ్చి ఉంటుంది'' అంది.

''ఏం లాభంతల్లీ! ఏదో వచ్చింది తిండికి సరిపోతుంది. అప్పుడప్పుడు అదీరాదు. కాని తల్లీ పట్టరాని సంతోషం, సుఖం, మనశ్శాంతి, తృప్తి లభిస్తాయి. నేను కోరేది కూడా ఇదే'' అన్నాడు.

''అదెలాగ?''

''ఇప్పుడా ప్రస్తావన ఎందుకమ్మా! ఆ సంగతి దయచేసి వదిలేసెయ్యండి. అది వినడం మీకూ కష్టదాయకమే. నాకు చెప్పడం బాధాకరమే అవుతుంది'' అన్నాడు.

''ఇంత చెప్పనే చెప్పావు. అదికూడా చెప్పు. ఆలస్యమైతే మిఠాయిలు చెల్లవని బాధపడక్కరలేదు. ఇంకా నేను కొంటాను.''

''నాకాబాధ ఎన్నడూ లేదు తల్లీ. అంతగా చెల్లకపోతే చిన్న చిన్న బిడ్డలకు పంచిపెట్టి వెళ్లిపోతాను'' అని, విపరీతమైన గాంభీర్యంతో, ''సరే, మీకంత కుతూహలమైనపుడు వినండి'' అంటూ మొదలెట్టాడు.

''నేను మా ఊరికి గౌరవనీయ వ్యక్తిని. ఇల్లు, వాకిలి, పాడి, పంట, నౌకర్లు, చాకర్లు, భార్య, బిడ్డలు ఉండేవారు. భార్య రూపవతి, గుణవతి. ఇద్దరు చిన్న మొగపిల్లలు ముద్దులు మూట గట్టేవారు. పండులాంటి సంసారం, బంగారంలాటి ఇల్లు. పిల్లలు గారాముతో మారాముచేస్తూంటే ఇల్లంతా కళకళ లాడేది. నా ఒళ్లంతా పులకలు దాల్చేది. తల్లీ, రోజుల సామాన్యం. ఆ పరమాత్మ లీల. ఈ ప్రపంచం అనే రంగస్థలంమీదనుంచి ఆ పాత్రలు తప్పుకున్నాయి. ఇప్పుడు నేనే మిగిలాను. మరేంకాదు. ఆ సూత్రధారుడు నాయీ పాత్రను పరిసమాప్తి చేయలేదు తల్లీ. ఎంత మొరపెట్టుకున్నా ఆలించలేదు కూడాను. ఇంక చేసేదిలేక ఈ విశాల వసుధలో నా కుటుంబాన్ని వెతుక్కుంటూ ఈ వ్యాపార మిషతో బయల్దేరాను తల్లీ. ఈ చిన్నారి పిల్లలనుచూస్తూంటే, ఆ నా పిల్లలే కనుపిస్తారు. వీళ్లలోనే ఆనా బిడ్డలు ఉండి ఉంటారు. పోయినవాళ్లని ఈ విధంగా పొందుతున్నాను అమ్మా'' అని కళ్లు ఒత్తుకున్నాడు. రోహిణికూడా సహానుభూతిచే ఆర్ద్రమైన నేత్రాలను తుడుచుకుంది.

సరిగ్గా ఇదే సమయానికి రవి, శ్యాము ఇంటికి వచ్చారు. తల్లి కంఠాన్ని కౌగలించుకొని ఆమె చీర కొంగు లాగుతూ ''అమ్మా, మిఠాయి'' అన్నారు.

''నేనిస్తాను రండి నాయనా'' అని మిఠాయి వాలా రెండు కాగితం పొట్లాలలో మిఠాయి కట్టి ఇద్దరికి ఇచ్చాడు.

రోహిణి డబ్బులు గిరవాటేసింది.

''ఈ సారి పైసలు తీసుకోను'' అంటూ పెట్టెనెత్తుకుని వెళ్లిపోయాడు.

దాది ''అలాక్కాదు డబ్బుతీసుకో అబ్బాయీ'' అంటూ వెనకాల వెళ్లేటప్పటికే దూరంనుంచి ''పిల్లలను ఆనందింపచేసే మిఠాయి వాలా'' అనే మధుర స్వరం సన్నగా వినిపించింది. ★

శైల సింహాలు ఫోటో—టి. భాస్కరరావు (మద్రాసు-17)

